సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 19 । నవంబర్ । 2024



పలు రైళ్ల దారి మళ్లింపు 8లో
విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లను ఆయా తేదీల్లో దారి మళ్లించారు.



శంభో శివ శంభో 8లో
పవిత్ర కార్తీకమాసం మూడవ సోమవారం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి.



బాలికల వికాసంపై అవగాహన
కిశోర్ బాలికల సాధికారతకు కిశోర 8లో వికాసం దోహద పడుతోందని గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి అన్నారు.

న్యూస్‌రీల్

పోలవరం జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ఏపీఈఆర్‌సీ చైర్మన్



పోలవరం జలవిద్యుత్ కేంద్రం పనులు పరిశీలిస్తున్న ఠాకూర్ రామసింగ్

దేవీపట్నం: పోలవరం జలవిద్యుత్ కేంద్రాన్ని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ ఠాకూర్‌రామసింగ్ సోమవారం సందర్శించారు. ఆయన వెంట కమిషన్ సభ్యుడు పి.వెంకటరామ రెడ్డి ఉన్నారు. పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు నుంచి జలవిద్యుత్ కేంద్రానికి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న కాలువ, విద్యుత్ కేంద్రం సర్వీస్‌బే, ఇతర నిర్మాణాలను వారు పరిశీలించారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జలవిద్యుత్ కేంద్రం పనుల పురోగతిని ఏపీజెన్‌కో హైడల్ విభాగం డైరెక్టర్ సుజయకుమార్, మేఘా ఇంజినీరింగ్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి సతీష్‌బాబు అంగర వివరించారు. పోలవరం జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్దేశిత సమయానికి పూర్తి చేయాల్సిందిగా నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్‌ను కోరామని, సంస్థ అందుకు అనుగుణంగా పనులు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా సివిల్, ఎలక్ట్రో మెకానికల్ పనులు చేస్తున్నట్టు సతీష్ బాబు తెలిపారు. ప్రాజెక్టు పనుల పట్ల చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. చైర్మన్ వెంట ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ (సివిల్) వై.కోటేశ్వరరావు, ఎస్ఈలు రామభద్రరాజు, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, ఈఈలు హనుమ, ప్రభాకరరావు తదితరులున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

వై.రామవరం: మండలంలోని చింతకర్రపాలెం సమీప జంక్షన్‌లో సోమవారం ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలోవిస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి రవాణా అవుతోందన్న సమాచారంతో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు, డ్రైవింగు లైసెన్స్‌లు లేని వాహనా లపై కేసులు నమోదుచేసి,జరిమానాలు విధించారు.

జీసీసీ చైర్మన్‌గా కిడారి శ్రావణ్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రావణ్‌కుమార్

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం జీసీసీ ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మౌలిక సదుపాయాల విస్తరణ, సిబ్బంది సంక్షేమం, అభివృద్ధి, వ్యాపార విస్తరణ, ప్రధాన యాత్రా కేంద్రాలు, పర్యాటక ప్రదేశాల్లో జీసీసీ రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అనంతరం గిరిజన ఉత్పత్తుల రవాణాను సులభతరం చేసేందుకు రెండు కొత్త లారీలను ప్రారంభించారు.

గతితప్పిన వసతి గృహాలు!



ముంచంగిపుట్టు మండలం పెదగూడలో ఆరుబయట భోజనం చేస్తున్న గిరిజన విద్యార్థులు

- సమస్యలతో కునారిల్లుతున్న హాస్టళ్లు
- కనీస సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు
- మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం పట్టని ప్రభుత్వం
- చన్నీటి స్నానాలతో వణుకుతున్న బాలబాలికలు
- కాస్మోటిక్స్ పంపిణీ ప్రకటనలకే పరిమితం
- విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సంక్షేమమే కనిపించడం లేదు. పలు వసతి గృహాలు దయనీయ స్థితిలో ఉన్నాయి. చాలా చోట్ల ప్రహరీలు లేవు, మరుగుదొడ్లకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడే పరిస్థితి నెలకొంది. ఒక్కటేమిటి.. సవాలక్ష సమస్యలు హాస్టళ్లలో తిష్ట వేశాయి. కాస్మొటిక్స్ అందజేత ప్రకటనలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం విద్యార్థులతో కూడా ఆటలాడుతోంది. సూపర్ సిక్స్ హామీల అమలులో కుప్పిగెంతులు వేస్తున్న నాయకులు చివరికి విద్యార్థులకు అందజేయవలసిన కాస్మొటిక్స్ విషయంలోనూ తమకు అలవాటైన ట్రిక్స్ అమలు చేస్తున్నారు. అధికారంలోకి వస్తే కాస్మొటిక్స్ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన నాయకులు ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు. జూన్, జులై చార్జీలను అందజేశామని అధికారులు చెబుతున్నారు. ఎవరికి పంపిణీ చేశారో తెలియక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విస్తుపోతున్నారు.

సాక్షి,పాడేరు: జిల్లాలో పలు వసతి గృహాలు దుర్భర స్థితిలో ఉన్నాయి. పలు సమస్యలు హాస్టళ్లలో తిష్ఠ వేశాయి. కాస్మోటిక్స్ అందజేత కూడా ప్రకటనలకే పరిమితమైంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు,ఇతర ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీ అమలుకాలేదు. గత ప్రభుత్వ హయాంలో తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి రూ.120 నుంచి రూ.160 చొప్పున చెల్లించేవారు. ఆ సొమ్ము తల్లుల ఖాతాలో జమయ్యేది. అయితే మేం అధికారంలో వస్తే నేరుగా కాస్మొటిక్స్ పంపిణీ చేస్తామని కూటమి నేతలు చెప్పారు. కాస్మొటిక్స్ పంపిణీ పంపిణీ మాట అటుంచితే నగదు కూడా ఖాతాల్లో జమచేయలేదు. జూన్, జులై నెలలకు సంబంధించిన నిధులు జమ చేశామని, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన బిల్లులను ట్రెజరీలకు పంపామని అధికారులు చెబుతున్నారు. జూన్, జులై నెలల్లో తమ ఖాతాల్లో డబ్బులు పడలేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 204 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 78వేల మంది,34 గిరిజన గురుకుల విద్యాలయాల్లో 10,774మంది, 4 మినీ గురుకుల పాఠశాలల్లో 2,140 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఇంతవరకూ సబ్బులు, కొబ్బరి నూనె, దుస్తులు ఉతికే సబ్బులు, ఇతర కాస్మొటిక్స్ పంపిణీ కాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. మరో ఐదు నెలల్లో విద్యాసంవత్సరం ముగిసే పరిస్థితిలో కూటమి ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రతినెలా వారి కాస్మొటిక్స్‌ను కొనేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొక్కిరాపల్లి ఆశ్రమ పాఠశాలలో పనిచేయని సోలార్ వాటర్ హీటర్

సమస్యలతో అవస్థలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంలో గిరిజన విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రెండవ విడతలో పలు గిరిజన విద్యాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంది.ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం రెండవ విడత నాడు–నేడు పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో పాటు పెండింగ్ పాఠశాలల అభివృద్ధిని ఇంత వరకు పట్టించుకోలేదు.దీంతో జిల్లాలోని పలు పాఠశాలల్లో ప్రహరీలు, మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు,ఇతర మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు.

భద్రత ఎక్కడ ?



తక్కువ ఎత్తులో ఉన్న కొక్కిరాపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రహరీ

కొక్కిరాపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ ఎత్తుగా లేకపోవడంతో రక్షణ పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థినులకు భద్రత కరవైంది. గోడ ఎత్తు పెంచి బాలికలకు మరింత రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్ పనిచేయకపోవడంతో ఇక్కడ బాలికలకు చన్నీళ్ల స్నానం తప్పడం లేదు.చలికాలంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు.భోజనశాల ఉన్నప్పటికీ అక్కడ బెంచీల సౌకర్యం లేదు. రన్నింగ్ వాటర్,సురక్షిత మినరల్ వాటర్ ప్లాంట్ కూడా అందుబాటులో లేవు.

కాస్మొటిక్స్ ఇవ్వడం లేదు



మా పాఠశాలలో కాస్మొటిక్స్ ఇవ్వడం లేదు. అమ్మ,నాన్నే సబ్బులు,కొబ్బరి నూనె,టూత్‌పేస్ట్,ఇతర సామగ్రి కొనిఇస్తున్నారు. నన్ను చూడడానికి వచ్చేటప్పుడు వీటిని తెస్తున్నారు.వారు ఒక వారం రాకపోతే బయటకు వెళ్లి కొనుక్కోలేక ఇబ్బందులు పడుతున్నాం. సబ్బులు,ఇతర సామగ్రి అందజేయాలి.

– పాంగి సౌమ్య, టెన్త్ విద్యార్థిని, పెదగరువు, ఆశ్రమ పాఠశాల హుకుంపేట మండలం

445 మంది బాలికలకు 16 బాత్‌రూమ్‌లే...

జి.మాడుగుల మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఉన్న కొక్కిరాపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన బాలికలు పలు అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు.ఈ ఆశ్రమ పాఠశాలను 'సాక్షి' విజిట్ చేయగా పలు అంశాలు బయటపడ్డాయి. 3 నుంచి 10వతరగతి వరకు 445 మంది గిరిజన బాలికలు చదువుతున్నారు.వీరందరికీ సరిపడే బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు లేవు. కేవలం పాతవి 16 మాత్రమే ఉన్నాయి. దీంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. నాడు–నేడు రెండవ విడతలో రూ.16లక్షలతో అదనంగా బాత్‌రూమ్‌లు మంజూరవడంతో 50శాతం వరకు పనులను హెచ్ఎం పూర్తి చేశారు.ఎన్నికల తరువాత నిధులు మంజూరు కాకపోవడంతో బాత్‌రూముల పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.



కొక్కిరాపల్లి ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణం

వస్త్రాలతో ప్రహరీ

జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లిషు మీడియం పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. పాఠశాల భవనం చుట్టూ వస్త్రంతో కూడిన కంచెను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా 3వ తరగతి నుంచి 10వతరగతి వరకు సుమారు 300మంది గిరిజన బాలికలు వసతితో కూడిన విద్యను అభ్యసిస్తున్నారు. కంచె స్థానంలో రక్షణగోడను నిర్మించి రక్షణ ఏర్పాట్లు చేయాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బాలికల ఆశ్రమ పాఠశాలలో వస్త్రాలతో ఏర్పాటు చేసిన ప్రహరీ

17,320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఈ మండలాల నుంచి ఈ ఏడాది 17,320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం వివిధ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పీవో మాట్లాడారు. దేవీపట్నం మండలానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రం మంగళవారం ప్రారంభమవుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం గోనె సంచులు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కోతుల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వానరాలను కట్టడిచేసేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా ఒక గ్రామాన్ని ప్రతిపాదించాలన్నారు. ఈ సమావేశంలో డీడీ షరీఫ్, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏఎస్‌వో విజయభాస్కర్, ఏడీఏ కె.సావిత్రి, సీహెచ్‌కేవీ చౌదరి, ఏవో లక్ష్మణ్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

డుంబ్రిగుడ: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు సూచించారు. అరకు ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని సూచించారు. అపార్ ప్రోగ్రెస్ ఎంతవరకు పూర్తి చేశారని ప్రధానోపాధ్యాయులు ఎం.జాన్‌ని అడిగి తెలుసుకున్నారు.

కేజీబీవీ ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలి

- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు డిమాండ్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: ఇంటర్మీడియెట్ విద్యార్థినులను అమానుషంగా దండించిన మండలంలో జి.ఎం.కొత్తూరు సమీపంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆ పాఠశాలను సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. సకాలంలో అసెంబ్లీకి రాలేదని ఇంటర్మీడియెట్ విద్యార్థినులపై ఆగ్రహించిన ప్రత్యేక అధికారి వారిని దండించి, జుత్తు కత్తిరించిన ఘటనపై ఆరా తీశారు. కార్తీక పౌర్ణమి నాడు ప్రత్యేక అధికారి సాయి ప్రసన్న, మరో ముగ్గురు టీచర్లు కలసి 18మంది విద్యార్థినులను కొట్టి, మండుటెండలో నిలబెట్టడడమే కాకుండా, జుత్తు కత్తిరించారని బాధిత విద్యార్థినులు ఎమ్మెల్యే వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక విద్యార్థిని అనారోగ్యంతోబాధపడుతున్నా విడిచిపెట్టలేదని వాపోయా రు. ముందుగా కేజీబీవీలో పనిచేస్తున్న టీచర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంఘటనతో విద్యార్థినులు తీవ్రమానసిక వేదనకు గురైనా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. వ్యాధులు, ఇతర సంఘటనల కారణంగా గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలు,వసతి గృహాల్లో విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా స్పందించడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన విద్యార్థుల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేజీబీవీ సంఘన బయటకు పొక్కకుండా చూసేందుకు ప్రత్యేక అధికారి నుంచి టీడీపీ నాయకుడు లకే రామకృష్ణ రూ.లక్ష డిమాండ్ చేశారని ఆరోపించారు. ఇటువంటి నాయకులపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ,ఎంపీటసీలు ఎం.విజయకుమారి,చిన్నారావు,సర్పంచ్‌లు కిముడు రాంబాబు, హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరసనల హోరు



చింతూరు ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

- ఐటీడీఏల వద్ద 108 సిబ్బంది, ఆశా వర్కర్ల ఆందోళనలు

పాడేరు/చింతూరు : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 108 సిబ్బంది, ఆశా వర్కర్లు వేర్వేరుగా పాడేరు, చింతూరు ఐటీడీఏల ఎద్ద ఎత్తున ధర్నా చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25నుంచి సమ్మె చేస్తామని 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.త్రినాథరావు, బి.శ్రీనివాస్ అల్టిమేటం జారీ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట 108 సిబ్బంది ఒక రోజు రీలే దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి, యాజమాన్యానికి పట్టడం లేదన్నారు. ఇప్పటికైన తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందర్‌రావు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి అందులో పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 108 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తేజ, శ్యామ్, దావీదు, శ్రీదేవి, సుజాత, మల్లికా, పాల్గొన్నారు.



పాడేరు ఐటీడీఏ ఎదుట రిలే దీక్ష చేస్తున్న 108 ఉద్యోగులు

చింతూరు ఐటీడీఏ వద్ద...

తమ సమస్యల పరిష్కరించాలని, ఒప్పందాల జీవోలను తక్షణమే జారీ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు సోమవారం చింతూరు ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రవ్వ వీరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా కార్యకర్తల శ్రమను గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదవీ విరమణ బెనిఫిట్ జీవో ఇవ్వాలని, రూ.6 లక్షల గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పల్లపు వెంకట్, పొడియం లక్ష్మణ్, సుబ్బారావు, నూతన, సుజాత, శ్రీదేవి, లక్ష్మి, రేణుక, ఉష పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోతున్నవారందరికీ నష్టపరిహారం

- సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రాజవొమ్మంగి: జాతీయ రహదారి నిర్మాణం కారణంగా ఇళ్లు, స్థలాలు, చెట్లు కోల్పోతున్న అర్హులందరికీ నష్టపరిహారం అందించనున్నట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వాసితులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్‌హెచ్ 516 ఈ రహదారి నిర్మాణంలో భాగంగా గతంలోనే సమగ్ర సర్వే జరిపి ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి ఇప్పటికే నష్టపరిహారం చెల్లించినట్టు చెప్పారు. సర్వేలో కొన్ని నిర్మాణాలు మిస్ అయ్యాయని, మరో సారి సర్వే జరపగా నష్టపరిహారం పొందలేకపోయిన మరో 275 మందిని గుర్తించామని తెలిపారు. వీటిలో 250 ప్రభుత్వ భూముల్లో, మరో 25 ప్రైవేటు భూములకు చెందినవిగా ఇప్పటికే గుర్తించినట్టు చెప్పారు. అర్హులందరికీ నష్టపరిహారం అందజేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రోడ్డు నిర్మాణం కారణంగా తొలగించిన ఆలయాలకు కూడా నష్టపరిహారం త్వరలోనే విడుదల అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ నిర్వహించి రాజవొమ్మంగి, దూసరపాము, చెరకుంపాలెం, జడ్డంగి గ్రామాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్వాసితుల సమస్యలను ఓపికతో విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక తహసీల్దార్ అల్లు సత్యనారాయణ, డీటీ కరీంముల్లా, ఆర్ఐ చెల్లమ్మ, సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీ శ్రీధర్, మండల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

భూ నిర్వాసితుల నుంచి అర్జీల స్వీకరణ

అడ్డతీగల: జాతీయ రహదారి 516ఇ నిర్మాణ పనుల వల్ల భూములు కోల్పోతున్న 70 మంది నిర్వాసితుల నుంచి మండల కేంద్రమైన అడ్డతీగలలో సోమవారం రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అర్జీలు స్వీకరించారు. భూ నిర్వాసితుల ఇచ్చిన అర్జీల్లోని వివరాల ప్రకారం కార్యాలయ రికార్డులను తెప్పించి పరిశీలించారు. అర్జీదారుల సమస్యలు విని తహసీల్దార్ శ్రీనివాసరావుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ తేజస్విని,వీఆర్వోలు పాల్గొన్నారు.



భూ నిర్వాసితుల అర్జీలు పరిశీలిస్తున్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

సింహగిరి జలధారలపై అధ్యయనం

సింహాచలం: సింహగిరిపై ఉన్న జలధారలపై దాన్ ఫౌండేషన్ సంస్థ సోమవారం అధ్యయనం చేసింది. ఆ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.లోకేష్ సింహగిరిపై ఉన్న గంగధార, నాగధార, సాగిధార, ఆకాశధారలను పరిశీలించారు. నీటి నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో తమ సంస్థ నగరంలో ఉన్న స్ప్రింగ్స్‌పై అధ్యయనం చేస్తోందన్నారు. నీటి నాణ్యత, వాటర్ ఫ్లో తదితర అంశాలపై పరిశీలిస్తున్నామన్నారు. అందులో భాగంగా సింహాచలం కొండపై ఉన్న జలధారలపై కూడా అధ్యయనం చేయనున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి ఫ్లో భవిష్యత్తులో కూడా అలాగే ఉంటుందా...లేకపోతే ఏం చేయాలన్న విషయంపై నిపుణులతో చర్చిస్తామన్నారు. దీనిపై ఓ రిపోర్టు తయారు చేయనున్నమని వెల్లడించారు. ఈనెల 23న కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి సమక్షంలో సింహాచలం దేవస్థానం అధికారులు, తమ ఆర్గనైజేషన్ అందజేసేంం నివేదికపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్

చింతూరు: తమకు కల్పించిన హక్కులను ఎస్సీ, ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ తెగల అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే నేరాలకు సంబంధించి చట్టరీత్యా వారికి ఎలాంటి రక్షణ లభిస్తుందో అందరూ తెలుసుకోవాలన్నారు. పలు కేసుల్లో విచారణ సమయంలో సాక్ష్యం సరిగా చెప్పకపోవడంతో నిందితులకు శిక్షలు పడడంలేదని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని ఆమె సూచించారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థి దశనుంచే వీటి గురించి సమగ్రంగా తెలుసుకోవాలని సూచించారు. చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం పెద్ద నేరమని, దీనికి అందరూ దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఎస్సీ, ఎస్టీ చట్టం, సెక్షన్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవికుమార్, సర్పంచ్ కారం కన్నారావు, చింతూరు ఎస్ఐ రమేష్, ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, ఆదివాసీ నాయకులు కుంజా శ్రీను, చిన్నారావు పాల్గొన్నారు.

బాలికల వికాసంపై అవగాహన

పాడేరు : కౌమర దశ బాలికల సాధికారతకు కిశోర వికాసం కార్యక్రమం దోహద పడుతోందని గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి.ఎస్. కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కాఫీ హౌస్‌లో సోమవారం మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కిశోర వికాసం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళ, శిశు సంక్షేమ శాఖతో పాటు వైద్య ఆరోగ్యం, విద్యా, సెర్ప్, పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కౌమర బాలికల వికాసం కోసం పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో మహిళ పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు కౌమర దశ బాలికలకు ఆరోగ్యం, విద్యా, రుతు క్రమంలో పరిశుభ్రత, పౌష్టికాహారం, ఉపాధి కల్పన, బాల్య వివాహాల నిరోధంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిపించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారితో జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. మండల స్థాయి అధికారులంతా గ్రామ స్థాయిలో విస్తృతంగా అవగాహన చేయాలన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఆరు శాఖలకు చెందిన అధికారులు మండల, గ్రామస్థాయిల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. డీఐఓ డాక్టర్ సాధన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు ప్రతి ఒక్కరు తమ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. బాలికలు రక్తహీనతకు గురి కాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను సరఫరా చేస్తున్నామని గ్రామాల్లో బాలికలు సక్రమంగా వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవోలు ఝాన్సీరాణి, బాలచంద్రామణి దేవి, డుంబ్రిగుడ ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వైద్యారోగ్య శాఖ, విద్యా శాఖ ఉద్యోగులు, సెర్ప్ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బోటనీ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు ఎమ్మెస్సీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, నెట్/సెట్ కలిగిన అభ్యర్థులు బుధవారం ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

పాడేరు : గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ఈ నెల 19 నుండి 22 వరకు, 26 నుండి 29వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి.ఎస్.కుమార్ అన్నారు. ఈ విడతలో గిరిజన సంక్షేమ శాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, అనాథ శరణాలయాలకు ప్రాధాన్యత ఇచ్చి ఆధార్ కార్డు లేని వారికి నమోదు చేయించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి ఆధార్ కార్డు లేని శిశువులు, ఆరేళ్ల వయస్సు గల పిల్లలకు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఆధార్ కార్డు లేని పిల్లల జాబితాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేయనున్నట్టు చెప్పారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కింది రైళ్లు మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి. ఆయా తేదీల్లో నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణించవు.

- ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు, 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ధన్‌బాద్‌లో బయల్దేరాల్సిన ధన్‌బాద్-అల్లెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్
- 21, 28వ తేదీల్లో టాటానగర్-యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్
- 20, 27వ తేదీల్లో జసిద్ది-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్
- 25న హతియా-ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్
- 23, 30వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్
- 19, 26వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 22, 29వ తేదీల్లో టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 28న విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 29న విశాఖపట్నం-హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్‌లు.

ఈ రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు రైళ్లకు థర్డ్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. భువనేశ్వర్-కెఎస్ఆర్ బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కెఎస్ఆర్ బెంగళూరు

- భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు 2-థర్డ్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నారు. భువనేశ్వర్-తిరుపతి(22879) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23, 30వ తేదీల్లోను, తిరుగు ప్రయాణంలో తిరుపతి-భువనేశ్వర్(22880) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24, డిసెంబరు 1వ తేదీల్లో 2-థర్డ్ ఏసీ కోచ్‌లను జత చేస్తున్నారు.

విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ నమోదు చేయాలి

మహారాణిపేట: ప్రతి విద్యార్థికి హెల్త్‌కార్డులో ఆరోగ్య ప్రొఫైల్ నమోదు చేయాలని కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిన్న పిల్లలకు ఆరోగ్య కార్యక్రమం నిర్వహణపై పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరావు, నోడల్ అధికారి డాక్టర్ ఎస్.వి.సమత, జిల్లా సమన్వయకర్త డాక్టర్ పూర్ణేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెన్నడో?

- గ్రామాల్లో మట్టి దారులు
- కానరాని రవాణా సౌకర్యం
- కాలినడకే శరణ్యం
- పట్టించుకోని అధికారులు



గుర్రాలపై నిత్యవసరాలు తరలిస్తున్న గాలికొండ పంచాయతీ పాత్రునిగుంట గ్రామస్తులు



కల్వర్టు లేక వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్న వంతడాపల్లి గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: మండలంలోని శివారు గ్రామాల గిరిజనులకు రహదారి, రవాణా కష్టాలు వీడడం లేదు. అనేక పంచాయతీల్లో కాలిబాటే శరణ్యమవుతోంది. కొండలు ఎక్కి, వాగులు దాటి గ్రామాలకు చేరుకోవాల్సి వస్తోంది. ప్రధానంగా గూడెంకొత్తవీధి మండలంలోని గాలికొండ, అమ్మవారి దారకొండ, జర్రెల పంచాయతీల్లోని గిరిజనులు తమ గ్రామాలకు సరైన రహదారులు లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మన్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలకు రహదారుల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. దీంతో పలు గ్రామాలకు రోడ్లు నిర్మించారు. అయితే ఎన్నికలు సమీపించడంతో చాలా ప్రాంతాల్లో రహదారుల పనులు నిలిచిపోయాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినా.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఒక్క పని ప్రారంభించలేదు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సరైన రహదారులు లేక రవాణా సదుపాయం కరువైంది. అత్యవసర సమయాల్లో 108, 104 సేవలు అందని పరిస్థితి నెలకొంది.

డోలీమోతలు.. గుర్రాలపైనే రాకపోకలు

మండలంలోని గాలికొండ పంచాయతీ పాత్రునిగుంట గ్రామానికి సరైన రహదారి లేదు. కాలినడకన రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వారపు సంత రోజుల్లో బయటకు వచ్చి గుర్రాలపై వెళ్లి సరకులను తీసుకురావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనూ 108, 104 సేవలు అందక డోలీమోతలు తప్పడం లేదని వాపోతున్నారు. పీవీటీజీ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని గొప్పలు చెపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి గ్రామాలపై కన్నెత్తి కూడా చూడడం లేదంటున్నారు. అధికారులు సైతం మా గ్రామాలకు రాకపోవడంతో మేము పడుతున్న కష్టాలు బయట ప్రపంచానికి తెలియడం లేదంటున్నారు. జర్రెల పంచాయతీ వంతడాపల్లి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గ్రామంలో కల్వర్టు లేకపోవడంతో వర్షం పడితే గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని గూడెంకొత్తవీధి మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారులు, కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల నిర్మాణంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు, ఆదేశాలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



వాహనచోదకుడిని ఢీకొన్న టిప్పర్

జి.మాడుగుల: పాడేరు వెళ్లే మార్గంలో బందవీధి గ్రామ సమీపంలో మలుపు వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ సంఘటనలో వాహనచోదకుడి తీవ్ర గాయమైంది. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు నుంచి జి.మాడుగుల వైపు బైక్‌పై తాడివీధి గ్రామానికి చెందిన సోమెలి రమణ వస్తుండగా వెనుక నుంచి వస్తున్న టిప్పర్ (జాతీయ రహదారి పనుల్లో భాగంగా మట్టిలోడ్‌తో) ఢీకొంది. ఈ ప్రమాదంలో టిప్పర్ ముందు చక్రం రమణ ఎడమకాలుపై ఎక్కడంతో నుజ్జునుజ్జు అయ్యింది. బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన రమణను 108 వాహనంలో పాడేరు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ప్రమాద సంఘటనపై పోలీస్‌లు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని మోదీ ప్రకటన చేయాలి
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్



ఐక్యత చాటుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నాయకులు, కార్యకర్తలు

డాబాగార్డెన్స్/ మహారాణిపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరిని విడనాడాలని, ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్‌ను కొనసాగించేలా సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 29వ తేదీన విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయబోమని, సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి స్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేసేలా నడపాలని, మిగిలిపోయిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌కు 26వేల ఎకరాల భూములు ఉన్నాయని, ఇవన్నీ రాష్ట్రపతి పేరిట ఉన్నాయని, వీటిని స్టీల్‌ప్లాంట్ పేరుతో బదలాయించాలన్నారు. ఈ నెల 24, 26 తేదీల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్‌బాబు, జి.గణపతిరెడ్డి, బొడ్డు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని పీఎంకు లేఖ

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అదేవిధంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి నేతృత్వంలో సోమవారం విశాఖపట్నంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.

అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించి ప్రధాని మోదీకి పంపాలని కోరారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ జైలు

విశాఖ లీగల్: అప్పు తీర్చమని అడిగిన వ్యక్తిని అతికిరాతకంగా హత్య చేసిన యువకుడికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా చెల్లించాలని నగరంలోని రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి గాయత్రీ దేవి సోమవారం తీర్పునిచ్చారు. మృతుని కుటుంబానికి రూ.6 లక్షలు జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగులు జగదీశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మురళీనగర్ ప్రాంతంలోని అయ్యప్ప నగర్‌కు చెందిన వై.పవన్ కుమార్ టాక్స్ సర్వీస్‌తో పాటు ఇంటర్‌నెట్ సెంటర్ నడుపుతున్నాడు. అదే ప్రాంతంలో శంకర్ శ్రీనివాస్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. ఇదే అదనుగా శ్రీనివాస్ నుంచి రూ.75 వేలు పవన్ కుమార్ అప్పుగా తీసుకున్నాడు. ఎన్నిసార్లు అడిగినా ఇదిగోఅదిగో అని దాట వేస్తున్నాడు. డబ్బులు ఇవ్వలేక..శంకర్ శ్రీనివాస్‌ను హత్య చేయాలని ప్లాన్ చేశాడు. పెట్రోల్ పోసి కాల్చి చంపాలని నిర్ణయించుకున్నాడు. డబ్బులు ఇస్తానని.. షాపు వద్దకు రమ్మని శ్రీనివాస్‌కు చెప్పాడు. మొదటి రోజు రాకపోవడంతో రెండో రోజు రాత్రి పది గంటల సమయంలో శ్రీనివాస్ షాప్ వద్దకు రాగానే..మాటా మాటా కలిపి కొద్ది దూరం తీసుకువెళ్లి పెట్రోల్ పోసి కాల్చివేశాడు. స్థానికులు గమనించి తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న శ్రీనివాస్‌ను ఆస్పత్రిలో చేర్పించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

శంభో శివ శంభో

- భక్తులతో కళకళలాడిన శైవక్షేత్రాలు
- మార్మోగిన శివనామస్మరణం



పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

సాక్షి, పాడేరు: పవిత్ర కార్తీకమాసం మూడవ సోమవారం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని శివాలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులంతా ఉదయాన్నే శివాలయాలకు చేరుకుని శివపరమాత్ముడికి ప్రత్యేక అభిషేకాలు జరుపుకున్నారు. బొర్రాగుహలులోని శివాలయంతో పాటు అరకులోయలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వర స్వామి, పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరిదేవి, పాతపాడేరులోని గౌరి నీలకంఠేశ్వరస్వామి, జి.మాడుగుల రోడ్డులోని త్రిలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి.అలాగే సంగోడి, వంజంగి, తురాయి మెట్ట, లగిశపల్లి, గడ్డంపుట్టు, తామరాపల్లి, వంతాడపల్లి శివాలయాల్లోను గిరిజనులు పూజలు చేశారు. అన్ని శివాలయాల్లోను సాయంత్రం కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్తీక మాస పూజలకు శైవ క్షేత్రాలకు స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

రౌడీయిజం వారి వృత్తి.. రాజకీయం ప్రవృత్తి.. తెలుగుదేశం క్రియాశీలక సభ్యులు వారు.. ఆ పార్టీ అండతో చెలరేగిపోతారు.. వారు ఉన్నారంటే ఆ ప్రాంతంలో ఎవరూ సంచరించడానికి వీల్లేదు.. ఎవరైనా ఎదురుగా కనిపిస్తే చాలు తమను ధిక్కరించినట్టు భావిస్తారు.. వారి పనిపడతారు. నర్సీపట్నంలో సర్వసిద్ధి నాగేశ్వరరావు అనే యువకుడి హత్య అలాగే జరిగింది. టీడీపీ నాయకుడు బండారు కొండబాబు, పార్టీ సాధారణ కార్యకర్త అయిన రౌడీ షీటర్ బండారు సంతోష్ అకారణంగా అతనిని పొట్టన పెట్టుకున్నారు. మృతుడి భార్య, ఇద్దరు పసిపిల్లలు అనాథలయ్యారు.


- నర్సీపట్నంలో యువకుడి దారుణ హత్య
- నిందితులిద్దరూ టీడీపీకి చెందినవారు
- అయ్యన్న ఇలాకాలో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు
- మృతుడి బంధువులు, గ్రామస్తుల ఆగ్రహం
- పోలీస్ స్టేషన్, ఏరియా ఆస్పత్రి ముట్టడి

రౌడీ రాజ్యం



ఇద్దరు పిల్లలతో మృతుడి భార్య లక్ష్మి

నర్సీపట్నం: హతుడికి, నిందితులకు పాత కక్షలు లేవు. హత్యకు గురైన నాగేశ్వరరావు అనుచితంగా ప్రవర్తించిందీ లేదు. కానీ క్షణాల్లో ప్రాణాలు తీశారు. టీడీపీ అండతో కలిగిన కండకావరమే అందుకు కారణం. అందుకే మృతుడి బంధువులు, గ్రామస్తుల్లో అంత ఆగ్రహం రగిలింది. హత్యను నిరసిస్తూ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడి ఇంటికి వెళ్లేందుకు వారు బయలుదేరగా మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకుని నిలువరించారు. వెనుతిరిగిన మృతుడి బంధువులు టౌన్ పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. హంతకులను అరెస్ట్ చేసి.. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. హత్యకు పాల్పడిన రౌడీ షీటర్ సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న బండారు కొండబాబును సాయంత్రంలోగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేస్తామని టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మెయిన్ రోడ్డుపై బైఠాయించిన మృతుడి బంధువులు, గ్రామస్తులు

అకారణంగా ప్రాణం తీశారు..

టౌన్ సీఐ గోవిందరావు అందించిన వివరాల ప్రకారం.. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సర్వసిద్ధి నాగేశ్వరరావు(నాగు) (32) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. నర్సీపట్నం కొత్తవీధిలో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన స్నేహితులు ఎస్.సురేష్, పి.నవీన్, శంకర్‌లను భోజనానికి ఇంటికి తీసుకువచ్చాడు. ఆ దారి వెంబడి రావొద్దంటూ అక్కడ మద్యం సేవిస్తున్న టీడీపీ నాయకుడు కొండబాబు, ఆ పార్టీ సాధారణ కార్యకర్త అయిన రౌడీషీటర్ సంతోష్ వారిని హెచ్చరించారు. భోజనం చేసి తిరిగి వెళ్తున్న మృతుడి స్నేహితుడు శంకర్‌ను మళ్లీ ఎందుకురా ఇలా వచ్చావంటూ బైక్ తాళాలు లాక్కొని సిగరెట్‌తో మెడపై కాల్చారు. శంకర్ వెళ్లి నాగేశ్వరరావును తీసుకురావడంతో ఇరువు వర్గాల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న రౌడీ షీటర్ సంతోష్, టీడీపీ నాయకుడు కొండబాబులు నాగేశ్వరరావుపై దాడి చేశారు. స్పృహ కోల్పోయిన నాగేశ్వరరావును బంధువులు సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఐదు నెలల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు.



హత్యకు గురైన నాగేశ్వరరావు (ఫైల్)

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

నాగేశ్వరరావు హత్య విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సోమవారం ఉదయం టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితులు ఇద్దరూ టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ అండతో ఎంత మందిని హతమారుస్తారంటూ బంధువులు, గ్రామస్తులు ఆక్రోశం వెలిబుచ్చారు. హత్యను నిరసిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఇంటికి వెళ్లేందుకు మూకుమ్మడిగా బయలుదేరారు. పోలీసులు నచ్చచెప్పడంతో వెనుతిరిగి టౌన్ పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. హత్యకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటామని టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ నచ్చజెప్పినా వారు శాంతించలేదు. మృతుడి సామాజిక వర్గానికి చెందిన నాయకుడు బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రి ముందు కూడా ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డుపై బైటాయించారు. దీంతో వాహనరాకపోకలు నిలిచిపోయాయి. హంతకులను అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తేనే మృతదేహాన్ని తీసుకువెళ్తామని లేదంటే, తీసుకువెళ్లే ప్రసక్తి లేదని భీష్మించారు. మృతుడి భార్య లక్ష్మి ఇద్దరు పిల్లలతో కన్నీరు మున్నీరుగా విలపించడం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

ఇద్దరు నిందితుల అరెస్ట్

నర్సీపట్నం: సర్వసిద్ధి నాగేశ్వరరావును హత్య చేసిన నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ మోహన్ తెలిపారు. మద్యం మత్తు, ప్రేరేపిత మాటలే హత్యకు దారి తీశాయన్నారు. మృతుడి మేనమామ పల్లా అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు కట్టామన్నారు. సీఐ గోవిందరావు బృందం నేరం జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్నారన్నారు. హత్యకు పాల్పడిన కొత్తవీధికి చెందిన రౌడీ షీటర్ బండారు సంతోష్‌ను సుబ్బారాయుడుపాలెం రాయల్ రిసార్ట్స్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. బండారు కొండబాబును మాకవరపాలెం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెంచామన్నారు. బహిరంగంగా మద్యం తాగితే కేసులు పెడతామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కేడీ పేట, డౌనూరు ప్రాంతాల్లో రెండు పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రౌడీ షీటర్లు ఎలాంటి ఆకతాయి చర్యలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహన్